కొండలు ప్రతిధ్వనించేటట్టు అరిచింది ఆ టీచర్.

"అరవకే తల్లీ.... దే ఆర్ చిల్డ్రిన్. వాళ్ళ మన స్తత్వం అంతే- మనం చెప్పినా వినరు. నీళ్ళమీద పోతూ చూడాలని వాళ్ళకు మాత్రం అనిపించదూ?" అన్నది ఆమె వయసేవున్న మరో టీచర్ కదులుతున్న జుట్టును వేళ్ళతో అణుచుకుంటూ—

"నీకేం ఇప్పుడు కబుర్లు చెబుతావ్.... వీళ్ళలో ఏ ఒక్క వెధవైనా నీళ్ళలోపడితే వాడి అమ్మ-నాన్న మనందర్నీ కట్టేసి ఈ నీళ్ళలో విసిరిపోతారు".

అంతా నవ్వేరు ఆ టీచర్ మాటలు వినగానే.

"వేడి వేడి బజ్జీలు - గారెలు" అంటూ ఒకడు వున్నట్టుండి లోపల్నించి ఓ పెద్ద ట్రేలో తినుబండారాలు పెట్టుకుని వచ్చాడు. పిల్లలంతా వాడిమీదకు ఎగబడ్డారు.

మౌనంగా పద్మ కిందికి చూస్తోంది. ఆమె అంతరంగంలో ప్రస్తుతం తను ప్రాణాధింగా ప్రేమించిన మధుసూదన్ గురించి ఆలోచనలు సుడులు తిరుగుతూ వుంటాయేమో?

"ఏమిటి ఆలోచిస్తున్నారు? అంత దీక్షగా నీళ్ళలోకి చూస్తున్నారు- మధుసూదన్ కోసమా?" చిన్నగా అడిగాను.

"వేళాకోళం చేస్తున్నారా?" తలెత్తి నవ్వుతూ నాకళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

"కాదు. మీ అంతరంగం నాకు తెల్సు. కొన్ని కొన్ని విషయాల గురించి మనుషులకు క్షుణ్ణంగా తెలిసినా ఏమీ తెలియని వారిలా ప్రవర్తిస్తారు. దానికి ఎవరైనా ఒక్కటే - నాకు అన్పిస్తోంది. మధుసూదన్ ఈ నీళ్ళలో ఎక్కడో- ఎక్కడో ఏమిటి? తను పడి

పోయిన చోటునే ఇంకా ఉన్నాడని.... అది సాధ్యమంటారా? అతని మీద మనకున్న ప్రేమ, అనురాగం వల్ల అలా అనిపిస్తోంది. అది నిజంకాదు అని తెలిసినా మనం ఈ విషయం ఆలోచిస్తాము. నిజానికి ఇది మనం కోరుకునే కోరిక. ఇతను ఇక్కడే వుంటే బాగుండును. ఇప్పుడు మీరుకూడా ఇలాగే ఆమె మాట్లాడలేదు. ఆలోచిస్తున్నారనుకుంటాను. అవునా?".

"ఆ కనబడే భవనమే మ్యూజియమ్" అన్నాను పద్మతో.

తలవూపి "మీకు సైకాలజీ తెలుసా?" అనడిగింది నవ్వుతూ-

"తెలీదు"

"బతికించారు"

"ఎందుకు?"

"తెలిస్తే నా ప్రాణం తీసేవాళ్ళు. తెలియకుండానే ఇంత సుత్తి కొట్టారు. తెలిస్తే ఇక నేను కూడా మధుసూదన్‌లాగే ఈ నీళ్ళలోకి దూకేదాన్ని మీ సుత్తి భరించలేక".

పెద్దగా నవ్వాను. "గుడ్ జోక్" అంటూ-

ఇంజన్ బర్ బర్‌మని చప్పుడు చేస్తోంది. లాంచీ దిశమారింది. మళ్ళీ నది మధ్యకు వచ్చింది.

సూర్యుడి వెలుగులో నీళ్ళ వంపులు తిరుగుతూ మెరుస్తున్నాయి.

ఇంజన్ చేస్తున్న చప్పుడుకు భయపడిన చేపలు నీళ్ళలో అంతెత్తున ఎగిరి పడుతున్నాయి. అలా పడినప్పుడల్లా "అదిగో చేప" అని అరుస్తున్నారు పిల్లలు.

మాతోపాటు లాంచీ మనిషిని బతిమలాడి ఎలాగో ఎక్కిన ఓ సాధువు వేషంలోవున్న వాతెవడో ఏవో భక్తి పాటలు పాడుతున్నాడు.

లాంచీ డ్రైవరు చుట్టూవున్న వాళ్ళకు ఇంకా ఏవో సంఘటనల గురించి- రోజూవచ్చే యాత్రికుల గురించి చెబుతున్నాడు.

